క్లుప్తంగా

ఆరోగ్యాన్ని రక్షించుకోవాలి



సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

బుక్కరాయసముద్రం: ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ సుజాత పేర్కొన్నారు. గురువారం వడియంపేటలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఏపీఎస్‌డీఎంఏ హెచ్‌పీసీఎల్ వారు మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. విపత్తుల నిర్వహణ, ప్రాథమిక చికిత్స విధానం గురించి అవగాహన కల్పించారు. డీఐఓ డాక్టర్ యుగంధర్, వేణుగోపాల్‌రెడ్డి, నారాయణరెడ్డి, డాక్టర్ స్వాతి లక్ష్మి ఉన్నారు.

26లోపు ఈ-కేవైసీ చేయించుకోండి

యల్లనూరు: మండల రైతులు ఈనెల 26లోగా ఈ- క్రాప్ బుకింగ్, ఈ-కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ఏఓ రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ప్రతి రైతు సాగు వివరాలను ట్యాబ్ యాప్‌లో నమోదు చేసుకోవాలన్నారు. 26వ తేదీ తరువాత ట్యాబ్‌లో పంట వివరాలను నమోదు చేసేందుకు వీలు ఉండదన్నారు. అలాగే ఈ-కేవైసీ చేయించుకోవాలని సూచించారు.

ఆర్బీకేల పరిశీలన

మండలంలోని చిలమకూరు, వెన్నపూసపల్లి ఆర్బీకే సెంటర్లను ఏఓ రామకృష్ణ పరిశీలించారు. రైతు సమస్యలను సిబ్బందితో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఈక్రాప్, ఈకేవైసీ ఎంత వరకు చేశారనే వాటిపై సిబ్బందితో చర్చించారు.

ఆధార్ సేవల్లో భేష్

యల్లనూరు: సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాల్లో ప్రజలకు చేసిన సేవలను గుర్తించి జిల్లాలో యల్లనూరు మండలానికి ప్రథమ స్థానం కల్పించారని ఈఓఆర్డీ విజయశేఖర్‌నాయుడు పేర్కొన్నారు. యల్లనూరు సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రానికి గుర్తింపు వచ్చిందన్నారు. జిల్లాలో ఆధార్ సెంటర్లల్లో యల్లనూరు ముందంజలో ఉందన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి



నారాయణ

శింగనమల: జిల్లాలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు చిన్నజలాలపురానికి చెందిన బోయ ఎన్వి నారాయణ పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియమితుడైన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్యా సలహాదారులు ఆలూరు సాంబశివారెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

బ్రిడ్జి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎస్‌ఈ ఓబుళరెడ్డి

యల్లనూరు: యల్లనూరు చిత్రావతి నదిలో బ్రిడ్జి పనులను నాణ్యతగా చేపట్టాలని ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ ఓబుళరెడ్డి సూచించారు. గురువారం చిత్రావతి నదిలో రూ.1.5 కోట్లతో చేపడుతున్న బ్రిడ్జి పనులను ఎస్‌ఈ ఓబుళరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు భోగాతి ప్రతాప్‌రెడ్డి పరిశీలించారు. పనులను వేగవంతంగా చేయాలని కాంట్రాక్టరు రియాజ్‌కు తెలియజేశారు. అనంతరం పని ప్రదేశంలో సూచనలను ఇచ్చారు. ఈఈ ప్రసాద్‌రెడ్డి, డీఈ శ్రీధర్‌రెడ్డి, ఏఈలు ఉన్నారు.

తప్పుడు వార్తలకు కేరాఫ్ ఈనాడు

బుక్కరాయసముద్రం: తప్పుడు వార్తలకు కేరాఫ్ ఈనాడు పత్రికని ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి ధ్వజమెత్తారు. గురువారం సాయంత్రం మండల కేంద్రంలోని తాడిపత్రి-అనంతపురం రహదారిపై అంబేడ్కర్ విగ్రహం ఎదుట వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈనాడు ప్రతులను దహనం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ భావజాలంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మెల్సీ స్థానాలు 18కిగాను 14 బీసీ, ఎస్టీ మైనార్టీలకు కేటాయించారన్నారు. అన్ని పత్రికల్లో బీసీలకు పెద్దపీట అని రాస్తే ఈనాడు మాత్రం రాష్ట్రంలో దౌర్జన్యం జరుగుతోందని కథనాలు రాస్తున్నారు. ఈనాడులో టీడీపీ నేత పట్టాభిని కొట్టారంటూ 2021 ఫొటోలను ప్రచురించి అడ్డంగా దొరికి పోయారన్నారు. ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ భాస్కర్, సర్పంచ్ పార్వతి, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు సాకే రామకృష్ణ, సొసైటీ అధ్యక్షులు వెంకటరెడ్డి, మండల కన్వీనర్ అంకే నరేష్, సీనియర్ నాయకులు ఆలూరి రమణారెడ్డి, గువ్వల రాజశేఖర్‌రెడ్డి, పూల నారాయణస్వామి, చికెన్ నారాయణస్వామి, బుల్లే నారాయణస్వామి, ముత్యాలశీన కొండమ్మ, ఆగ్రోస్ రామకృష్ణారెడ్డి, అనంత వెంకటరెడ్డి, కాటమయ్య, జేఎస్పీ మండలాధ్యక్షుడు బయపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.





గుంతకల్లుటౌన్: ఈనాడు ప్రతులను దహనం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు , గుత్తిలో..

ఈనాడును నిషేధించాలి

గుంతకల్లుటౌన్: తప్పుడు కథనాలతో ప్రభుత్వంపై బురదజల్లుతున్న ఈనాడును నిషేధించాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకల రామాంజినేయులు, వార్డు సచివాలయాల పట్టణ కన్వీనర్ ఎండీ.ఖలీల్ డిమాండ్ చేశారు. టీడీపీ నేత పట్టాభిని కొట్టారని తప్పుడు వార్తను ప్రచురించి ఈనాడు చంద్రబాబు కరపత్రంగా మారిందని వారు మండిపడ్డారు. రామోజీరావు వైఖరిని వ్యతిరేకిస్తూ గురువారం స్థానిక పొట్టిశ్రీరాములు సర్కిల్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులు ఈనాడు ప్రతులను దహనం చేశారు. రామోజీరావు డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. సమాజాన్ని తప్పుదోవ పట్టిస్తున్న ఈనాడుతో పాటు ఆంధ్రజ్యోతి, టీవీ5లను బహిష్కరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సుంకప్ప, కౌన్సిలర్ రవీంద్ర, వార్డు ఇన్‌చార్జ్‌లు మార్కెట్ వెంకటేష్, నూర్‌నిజామి, పీఎస్.మస్తాన్, మాచర్ల శివ, వీరేష్, దర్గానాయుడు, హరినాథ్, యూనస్, సంపత్, బి.సుంకప్ప, శ్రీనివాసులు, చింతలాంపల్లి బొజ్జన్న, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఈనాడు ప్రతుల దహనం

గుత్తి: గుత్తి పట్టణంలోని గాంధీ సర్కిల్ వద్ద గురువారం వైఎస్సార్ సీపీ నాయకులు ఈనాడు ప్రతులను దహనం చేశారు. పట్టణ, మండల కన్వీనర్లు పీరా, గోవర్ధన్‌రెడ్డి, నిర్మల, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మల్లయ్యయాదవ్, అశ్వ మారెన్న, చెర్లోపల్లి సర్పంచు అప్పా వెంకటేష్, మున్సిపల్ కౌన్సిలర్లు వరదరాజులు, కేవీ రమణ, ఫరూక్, ఖాజాఖాన్, పట్టణ, మండల సచివాలయ కన్వీనర్లు రంగస్వామి, సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ నేత పట్టాభిని ఎవరూ కొట్టలేదని అయితే అతన్ని కొట్టారని పాత ఫొటోలు ఈనాడులో ప్రచురించడం పాత్రికేయ వృత్తికే కలంకమన్నారు. సీనియర్ నాయకులు బేడల వెంకటరాముడు, మర్తాడు అన్సార్, రామ రంగారెడ్డి, గోపాల్‌రెడ్డి, లాలూ నాయక్,రమేష్‌రెడ్డి, సునీల్, జీపు రమణ, లక్ష్మిరెడ్డి, నారాయణస్వామి, అబ్దుల్, ఆరటి పండ్ల చంద్ర, ఓబులపతి, కోటా వెంకటేష్, మహమ్మద్, చెన్నాజీ తదితరులు పాల్గొన్నారు.

ఓల్డ్ సీపీఐ కాలనీవాసులు భయపడొద్దు

గుత్తి: పట్టణంలోని ఓల్డ్ సీపీఐ కాలనీ(కర్నూల్ రోడ్డు)వాసులు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, వారందరికీ తాను అండగా ఉంటానని గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి గురువారం ఫోన్ ద్వారా విలేకరులకు తెలియజేశారు. వివరాల్లోకి వెళితే.. రెండు మాసాలుగా సికిందరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి ఓల్డ్ సీపీఐ కాలనీ(సర్వే నంబర్-624) వాసులకు మిలటరీ తోపు అని అందరికీ నోటీసులు పోస్టు ద్వారా పంపుతున్నారు. దీంతో కాలనీవాసుల్లో అలజడి రేగింది. ఈ విషయం ఎమ్మెల్యే వైవీఆర్‌కు కాలనీవాసులు తెలియజేశారు. దీంతో ఎమ్మెల్యే స్పందించారు. సుమారు 50 సంవత్సరాల క్రితం వేలాది మంది పేదలకు సర్వే నంబర్ 624లో ఇంటి పట్టాలు ఇచ్చారని, నోటీసులు ఇవ్వడమే తప్పన్నారు. రెవెన్యూ అధికారులు పేదలకు ఇచ్చిన స్థలాలకు ఎవరో నోటీసులు ఇవ్వడం భావ్యం కాదన్నారు. తాను జిల్లా కలెక్టర్, ఆర్డీఓతో పాటు సంబంధిత అధికారులందరితో మాట్లాడానన్నారు. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. అందరికీ తాను అండగా ఉంటానన్నారు. ఆర్డీఓ ద్వారా ఓ మెమొరాండంను జిల్లా కలెక్టర్‌కు పంపామని, కలెక్టర్ ఈ విషయాన్ని పరిశీలించి క్లోజ్ చేస్తారన్నారు. రెవెన్యూ అధికారులకు అర్జీ పెడితే మిలటరీ తోపునకు అవసరమైతే మరో ప్రాంతంలో స్థలాన్ని ఏర్పాటు చేసే అవకాశ ముంటుందన్నారు.

మృతుడి కుటుంబానికి చేయూత

శింగనమల: వారం రోజుల క్రితం నార్పల మండలం నాయనపల్లిలో వెల్డింగ్ పని చేస్తున్న మోహన్ విద్యుదాఘాతంతో మృతి చెందిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి తల్లి జొన్నలగడ్డ నిర్మలాదేవి గురువారం మోహన్ ఇంటికి చేరుకుని ఆయన భార్య వెంకటలక్ష్మిని పరామర్శించారు. పింఛన్, ఇల్లు, బీమా త్వరగా వచ్చేలా చూస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం నిత్యావసరాలను అందజేశారు. సర్పంచ్ నాగమునెమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నగేష్, ఎంపీటీసీ కురుబ ఉమా, వైస్ సర్పంచ్ లక్ష్మీనారాయణరెడ్డి, మహిళ నేతలు ఉల్లికల్లు చెన్నమ్మ, శకుంతలమ్మ, నాయకులు శివశంకర్‌రెడ్డి, నవీన్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



మోహన్ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న జొన్నలగడ్డ నిర్మలాదేవి

దళితులకు శ్మశాన వాటిక ఏర్పాటు చేస్తాం

బుక్కరాయసముద్రం: గోవిందపల్లి పంచాయతీలో దళితులకు శ్మశాన వాటిక ఏర్పాటు చేస్తామని వైఎస్సార్ సీపీ నేత, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ అంకే ముసలన్న పేర్కొన్నారు. గురువారం గోవిందపల్లి, భద్రంపల్లిలో దళితులకు శ్మశాన వాటిక కోసం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ముసలన్న మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దళితుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. గోవిందపల్లి పంచాయతీలో శ్మశాన వాటిక లేక దళితులు అనేక ఇబ్బందులు పడేవారన్నారు. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ప్రత్యేక చొరవతో శ్మశాన వాటిక ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. మండల సర్వేయర్ రఘునాథ్, గ్రామ సర్వేయర్ నవీన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎంపీడీఓగా కొండన్న

యల్లనూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓగా కొండన్న గురువారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేస్తున్న ఓబులమ్మ పదోన్నతిపై డీఎల్‌డీవోగా అనంతపురం బదిలీ అయ్యారు.

భయాన్ని పోగొట్టేందుకే మోడల్ పరీక్ష

గుంతకల్లుటౌన్: పదవ తరగతి పబ్లిక్ పరీక్ష పట్ల విద్యార్థుల్లో ఉన్న భయాన్ని పోగొట్టేందుకు జిజీ.రావు విజ్ఞాన కేంద్రం నిర్వహిస్తున్న టెన్త్ క్లాస్ మోడల్ టెస్ట్ ఎంతగానో దోహదపడుతుందని శ్రీశంకరానంద డిగ్రీ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్‌కె.నాయుడు తెలిపారు. గురువారం భారత రాజ్యాంగ అవగాహన వేదిక ఆధ్వర్యంలో స్థానిక హనుమాన్‌సర్కిల్‌లోని శ్రీశైల భ్రమరాంబిక జూనియర్ కళాశాలలో టెన్త్ విద్యార్థులకు మోడల్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్ష ప్రశ్నపత్రాలను ఆర్‌కె.నాయుడు, శ్రీశైల విద్యాసంస్థల కరస్పాండెంట్ సత్యం విడుదల చేశారు. విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. 360 మంది విద్యార్థులను మోడల్ టెస్ట్‌ను రాశారు. కార్యక్రమంలో జిజీ.రావు విజ్ఞాన కేంద్రం కన్వీనర్ రమేష్, రాజ్యాంగ వేదిక కన్వీనర్ చంద్రశేఖర్, సభ్యులు సునీల్, వేణుగోపాల్, మధు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పాలెం రంగనాథరెడ్డికి అభినందనలు

తాడిపత్రి టౌన్ : వైఎస్సార్ సీపీ వికలాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన తాడిపత్రి వైఎస్సార్‌సీపీ 13వ వార్డు కౌన్సిలర్ పాలెం రంగనాథరెడ్డిని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అభినందించారు. బుధవారం స్థానిక భగత్‌సింగ్‌నగర్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం రంగనాథరెడ్డి ఎమ్మెల్యేను కలిశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



రంగనాథరెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

యాడికిలో జరగనున్న యాడికి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలకు రావాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి ఆలయ కమిటీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్‌నాయుడు, ఉప సర్పంచ్ చంద్రమోహన్ ఆహ్వాన పత్రిక అందజేశారు. స్వామి కల్యాణానికి తప్పక వస్తానని ఎమ్మెల్యే హామిచ్చినట్లు రమేష్‌నాయుడు తెలిపారు.

వార్డుల్లో ఎమ్మెల్యే పర్యటన

తాడిపత్రిటౌన్: పట్టణంలోని పలు కాలనీల్లో గురువారం సాయంత్రం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పర్యటించారు. పట్టణంలోని పుట్లూరు రోడ్డు సర్కిల్, యల్లనూరు రోడ్డు సర్కిల్, రెడ్డివారిపాలెం, అంబేడ్కర్‌నగర్ వీధుల్లో తిరిగి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చిన డ్రైనేజీ, నీరు, విద్యుత్, వీధి దీపాలు వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని వార్డు సచివాలయ సెక్రటరీలు, వలంటీర్లు, మున్సిపల్ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

గార్లదిన్నె: పంటల్లో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని శాస్త్రవేత్త దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. గురువారం కల్లూరులో వరి పంటలో పొలంబడి కార్యక్రమంపై రైతులు, వ్యవసాయ సిబ్బందికి క్షేత్ర స్థాయిలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శాస్త్రవేత్త దుర్గాప్రసాద్ మాట్లాడుతూ రైతులు పంటల్లో రసాయన మందులు వాడకం తగ్గించి సమగ్ర పంటల యాజమాన్య పద్ధతులు పాటిస్తే చీడ, పీడలు నివారించవచ్చన్నారు.అలాగే ఈనెల 26 నుంచి రబీలో పంటలు సాగు చేసిన రైతులకు పంట నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. పంట నమోదు కోసం ఆర్బీకే సిబ్బందిని సంప్రదించాలన్నారు. మండలంలో ఇప్పటి వరకు 1,285 మంది రైతులు పంట నమోదు చేసుకోగా 1,143 మంది రైతులు ఈకేవైసీ నమోదు చేసుకున్నారన్నారు. అనంతరం వరి పంటలో యాజమాన్య పద్ధతులు, పరిసరాల విశ్లేషణ, చీడ, పీడలు గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఏడీఏ వెంకట రాముడు, ఏఓ సోమశేఖర్, ఏఈఓ స్రవంతి పాల్గొన్నారు.



వరిలో పొలంబడి కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

పన్ను బకాయిలను వసూలు చేయండి

గుంతకల్లుటౌన్: ఆస్తి, నీటి పన్ను బకాయి వసూలుపై దృష్టి సారించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న వార్డు సచివాలయ కార్యదర్శులకు సూచించారు. గురువారం కమిషనర్ 12వ వార్డు సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పన్నుల వసూలులో నిర్లక్ష్యం తగదన్నారు. తాగునీరు, శానిటేషన్ తదితర ఫిర్యాదులపై వెంటనే స్పందించి వాటి పరిష్కరించాలని ఆదేశించారు.

దేశ నిర్మాణంలో యువశక్తిదే కీలకపాత్ర

గుంతకల్లు రూరల్: దేశ నిర్మాణంలో యువశక్తిదే కీలక పాత్ర అని ప్రిన్సిపాల్ పీ గోపాల్ అన్నారు. గురువారం శ్రీ శంకరానందగిరీ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ యూనిట్ ఆధారిత ఉపన్యాస అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

కంటి వైద్య శిబిరం

పామిడి: స్థానిక షాదీఖానాలో గురువారం పామిడి లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, జిల్లా ఆయూష్ వైద్యాధికారి నల్లపాటి తిరుపతినాయుడు ఆధ్వర్యంలో బెంగళూరు శంకర ఆసుపత్రి వారు ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కంటి వైద్య నిపుణులు 300 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 107 మందిని కంటి శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. క్లబ్ ప్రెసిడెంట్ డాక్టర్ టీ మురళీకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎం శాంతిప్రియ, కార్యదర్శి పీసీ జయరామ్, కోశాధికారి టీ రజని, జిల్లా చైర్మన్ బారాన్‌సాబ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వమొద్దు

నార్పల: ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దని మండల ప్రత్యేక అధికారి మహమ్మద్ రఫీ పేర్కొన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐసీడీఎస్ సిబ్బంది గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.

కోరం లేక మండల మీట్ వాయిదా

యల్లనూరు: ప్రతి మూడు నెలలకోసారి జరిగే మండల సాధారణ సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా వేసినట్లు ఎంపీడీఓ కొండన్న తెలిపారు. ఈ సందర్భంగా తగినంత మంది ఎంపీటీసీలు లేకపోవడంతో సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారానికి వాయిదా వేశామన్నారు. జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు, హాజరుకావాలన్నారు.

జీవనాలయానికి నిత్యావసరాల పంపిణీ

తాడిపత్రి టౌన్ : తాడిపత్రి మండలం ఆవుల తిప్పాయపల్లి సమీపంలోని జీవనాలయానికి గురువారం రూ.12 వేలు విలువ చేసే నిత్యావసర వస్తువులను రోటరీ క్లబ్ తరపున అందజేసినట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు షాకీర్ తెలిపారు. వరల్డ్ రోటరీ డేను పురస్కరించుకుని క్లబ్ తరపున తమ వంతుగా నిత్యావసర వస్తువులను ఇచ్చామన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి కిశోర్, సభ్యులు పెద్దమద్దిలేటి, శ్రీకాంత్, కుళ్లాయి స్వామి, రమేష్, శివ, నాగేంద్ర, సత్య ప్రసాద్‌రెడ్డి, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

యాడికి: ఎరువుల దుకాణదారులు ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుంటామని ఏడీఏ నారాయణ నాయక్ హెచ్చరించారు. రాయలచెరువులోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను గురువారం ఆయన ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఎరువులను అధిక ధరలకు విక్రయించరాదన్నారు. రైతులు ఇబ్బంది పడేలా వ్యవహరిస్తే సహించేది లేదన్నారు. రెడ్, వైట్ పొటాష్‌లో పొటాష్ 60 శాతం ఉటుందన్నారు. రైతులు అపోహలు విడనాడి రెడ్ పొటాష్‌ను విని యోగించుకోవాలన్నారు. ఎరువులు, పురుగు మందులు కొనేటప్పుడు దుకాణదారులు రైతులకు బిల్లులు ఇవ్వాలని లేనిపక్షంలో లైసెన్సును రద్దు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఓ మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

గుత్తి రూరల్: సచివాలయ ఉద్యోగులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ చిత్రా శ్రీనివాసులు హెచ్చరించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని మహిళా పోలీసులు, ఏఎన్‌ఎం, సంక్షేమ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు సమయానికి విధులకు హాజరు కావడం లేదని ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. విధులకు ఆలస్యంగా వస్తూ సాయంత్రం త్వరగా వెళ్తున్న వారిని గుర్తించి కలెక్టర్‌కు నివేదికను పంపుతామన్నారు. బయో మెట్రిక్ ద్వారా తప్పకుండా హాజరు వేయాలన్నారు. సచివాలయ పరిధిలోని గ్రామాల్లో విధిగా పర్యటించి సమస్యలను గుర్తించి తమ దృష్టికి తేవాలన్నారు. తప్పకుండా యూనిఫాం ధరించాలన్నారు. ఈఓఆర్డీ శివాజీరెడ్డి, ఎంఈఓ రవినాయక్, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పోలీసుల అదుపులో అనుమానితులు

గుత్తి: పట్టణంలోని అనంతపురం రోడ్డులో సేఫ్ ఆసుపత్రి వద్ద ఈ నెల 21 రాత్రి గుంతకల్లు మండలం వైటీ చెరువు గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ పుల్లన్న అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం విదితమే. అయితే సేఫ్ ఆసుపత్రి వైద్యం వికటించడం వల్ల కాని లేదా వైటీ చెరువు గ్రామానికి చెందిన ప్రవీణ్, అంజనప్ప, ఆంజనేయులు, రామాంజనేయులు అనే వ్యక్తుల కారణంగా తన భర్త మృతి ఉండవచ్చునని మృతుని భార్య దేవి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతుడు భార్య ఫిర్యాదు మేరకు గురువారం పోలీసులు పై నలుగురితో పాటు సేఫ్ ఆసుపత్రి సిబ్బందిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

వసతులు కల్పించడంతో నిర్లక్ష్యమొద్దు

పెద్దవడుగూరు : పెట్రోల్ బంకుల్లో వాహనదారులకు వసతులను కల్పించడం బంకుల యజమానులు నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని డిప్యూటీ తహసీల్దార్ శ్రీరాములు, ఆర్ఐ శ్రీనివాసులు సూచించారు. గురువారం పెద్దవడుగూరుతో పాటు క్రిష్టిపాడు, అప్పేచర్లలోని 5 బంకులను తనిఖీ చేశారు. బంకుల యజమానులు వాహనదారులకు తాగునీరు, గాలిమిషన్‌లను వసతులను సక్రమంగా కల్పించడం లేదని వారు పేర్కొన్నారు.

బాల్య వివాహాలు అనర్థదాయకం

గుంతకల్లు రూరల్: బాల్య వివాహాలు అనర్థదాయకమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పావతి సూచించారు. గురువారం గుండాల తండా, మొలకలపెంట గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసిన ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పావతి అనంతరం గ్రామంలో తన సిబ్బందితో కలిసి బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు బాలికలను బాలురతో సమానంగా చదివించాలన్నారు.

27న హుండీ కానుకల లెక్కింపు

గుంతకల్లు రూరల్: బుగ్గ సంగమేశ్వరాలయంలో ఈనెల 27న హుండీ కానుకలను లెక్కించనున్నట్లు ఆలయ ఈవో కృష్ణయ్య గురువారం తెలిపారు. అదే రోజు మధ్యాహ్నం అన్నదానమునకు ఉపయోగపడని బియ్యాన్ని బహిరంగ వేలం వేస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు రూ.2 వేలు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చని ఈఓ తెలిపారు.

శుభకార్యం

గుత్తి రూరల్: పి.ఎర్రగుడి గ్రామంలో గురువారం వైఎస్సార్‌సీపీ కార్యకర్త మోటా శ్రీరాములు, లక్ష్మిదేవి దంపతుల కుమార్తె చాముండేశ్వరి వివాహం జరిగింది. ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, సర్పంచ్ మోటా పాపన్న, నాయకులు విశ్వనాథ్‌రెడ్డి, నగేష్, దేవ, శంకర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, పాల్గొన్నారు.

దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోండి

పుట్లూరు: దోమలు కుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి శ్రీవాణి అన్నారు. గురువారం ఆమె మండలకేంద్రంలోని బీసీ హాస్టల్, కేజీబీవీలో విద్యార్థులకు విషజ్వరాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు దోమ తెరలను వినియోగించాలన్నారు. అనంతరం ఆయా హాస్టళ్లలో హెల్త్ సూపర్‌వైజర్ వలి దోమల మందును పిచికారీ చేయించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మెనూ తప్పనిసరిగా పాటించాలి

యాడికి: జగనన్న గోరుముద్ద పథకం కింద ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజనంలో తప్పనిసరిగా మెనూ పాటించాలని ఎంఈఓ కాశెప్ప నిర్వాహకులకు సూచించారు. గురువారం మండల కేంద్రంతో పాటు రాయలచెరువు ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంఈఓ పరిశీలించారు. రుచి, శుచితో కూడిన భోజనం విద్యార్థులకు అందజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో యాడికి, రాయలచెరువు ఉన్నత పాఠశాల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

గుంతకల్లు రూరల్: మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని సెబ్ సీఐ మహేష్ కుమార్ విద్యార్థులకు సూచించారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఐటీఐలో మాదక ద్రవ్యాలు, వాటి దుష్ఫలితాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా సెబ్ సీఐ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు అలవాటు పడి యువత చిన్న వయసులోనే జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థానాలు అధిరోహించాలని సూచించారు.

గాయపడిన డ్రైవర్ మృతి

యాడికి: రెండు లారీల ఢీ కొన్న ఘటనలో గాయాలపాలైన డ్రైవర్ మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. రాయలచెరువు గ్రామంలో బుధవారం రాత్రి జరిగిన రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొనడంతో తమిళనాడుకు చెందిన కరుణాకర్ (60) అనే డ్రైవర్ తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. అతడిని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో గురువారం ఉదయం అక్కడే మృతి చెందాడు.